సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025





శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్) స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

కల్యాణ ఘట్టాలు

- ఉదయం 9:50 గంటలు : కల్యాణ మండపానికి దేవేరుల ఆగమనం
- 10:22 : విశ్వక్సేన పూజ
- 10:33 : పుణ్యావాచనం
- 10:49 : శ్రీయోద్వాహం
- 11:13 : యోక్త్రా బంధనం, యజ్ఞోపవీత ధారణ
- 11:17 : శ్రీరాముడికి పాద ప్రక్షాళన
- 11:19 : అలంకరణ
- 11:26 : మధుపర్క నివేదన
- 11:33 : మహా సంకల్పం
- 11: 46 : కన్యాదానం
- 11:57 : పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మధ్యాహ్నం 12:01 గంటలు : అభిజిత్ లగ్నంలో వధూవరుల తలలపై జీలకర్ర బెల్లం
- 12:13 : మాంగళ్య ధారణ
- 12:22 : తలంబ్రాల వేడుక
- 12:36 : స్వామి, అమ్మవార్లకు హారతి



సీతారాములపై జీలకర్ర, బెల్లం పెడుతున్న అర్చకులు



సీతమ్మ తల్లికి రామయ్య తరపున మాంగళ్యధారణ



సీతారాములపై ముత్యాల తలంబ్రాలు...



జానకిరాముల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

- అభిజిత్ లగ్నంలో ఒక్కటైన జానకిరాములు
- కల్యాణోత్సవానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి
- 11.57 గంటలకు మండపం వద్దకు ముఖ్యమంత్రి
- కల్యాణం అనంతరం సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

పులకించిన భక్త గిరి



కల్యాణాన్ని తిలకిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు, మంత్రి పొంగులేటి దంపతులు, హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా, సీఎస్ శాంతికుమారి, ఎంపీ వద్దిరాజు తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో శ్రీ సీతారాముల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు తన్మయత్వంతో వేడుకలను కనులారా వీక్షించి పులకించిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీ సమేతంగా వేడుకలకు హాజరై స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం 8 గంటలకు మొదట గర్భగుడిలో మూలవిరాట్‌కు లఘు కల్యాణం నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తూ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, శ్రీయోద్వాహం, యోక్త్రాబంధనం, అలంకరణ, కన్యాదానం తదితర కార్యక్రమాలు నిర్వహించాక అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి పెళ్లి తంతు కొనసాగించారు. మధ్యాహ్నం 12:13 గంటలకు మాంగళ్యధారణ జరగగా ఆ తర్వాత తలంబ్రాల వేడుక, హారతి సమర్పణతో వివాహ తంతు ముగిసింది. చివరగా సీతారాములకు తిరువీధి సేవ నిర్వహించారు.

లగ్నానికి కొంచెం ముందుగా..

షెడ్యూల్ టైం ప్రకారం ఉదయం 10:45 గంటలకు భద్రాచలం ఆలయానికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకోవాలి, అక్కడ పూజా కార్యక్రమాలు చూసుకుని ఉదయం 11:10 గంటలకు కల్యాణ మండపానికి రావాల్సి ఉంది. కానీ ఆయన ఆలయానికి చేరుకునే సరికే ఉదయం 11:32 గంటలైంది. దీంతో అభిజిత్ లగ్నం సమయానికి సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణ మండపానికి చేరుకుని పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందిస్తారా అనే సందేహం ఏర్పడింది. సాధారణంగా సీతారాముల వివాహ తంతులో అలంకరణలు, మధుపర్కం నివేదించిన తర్వాత పట్టు వస్త్రాలు సమర్పిస్తుంటారు. మధుపర్కం కార్యక్రమం ముగిసినప్పటికీ సీఎం కల్యాణ మండపానికి చేరుకోకపోవడంతో ఆ తర్వాత ఘట్టమైన కన్యాదాన కార్యక్రమాన్ని కూడా అర్చకులు ప్రారంభించారు. ఈ క్రమంలో అభిజిత్ లగ్నానికి మూడు నిమిషాల ముందు.. అంటే 11:57 గంటలకు రేవంత్‌రెడ్డి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. వెంటనే పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ ఘట్టం ముగియగానే అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12:01గంటల సమయంలో వధూవరులైన సీతారాముల శిరస్సులపై అర్చకులు జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. ఆ తర్వాత ఇతర మంత్రులు, శ్రీరామదాసు, తూమూ నర్సింహదాసు వంశీయులు, త్రిదండి పీఠం, టీటీడీ తరపున, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు వస్త్రాలు సమర్పించారు.

ప్రత్యేక ఏర్పాట్లు లేకుండా

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసే కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మ గుడి దగ్గరున్న నాయక్‌పోడు తెగకు చెందిన బూరం శ్రీనివాస్ ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. ఇంటి ముందు కారు దిగి అక్కడున్న ప్రజలకు అభివాదం, దగ్గరగా ఉన్న వారికి షేక్ హ్యాండ్ ఇస్తూ లోపలికి వెళ్లారు. శ్రీనివాస్ తల్లి పద్మావతి సీఎం రేవంత్‌రెడ్డికి ఎదురెళ్లి హారతి ఇచ్చి బొట్టు పెట్టి ఇంట్లోకి ఆహ్వానించారు. అప్పటికే సీఎం రాక సందర్భంగా 'ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయొద్దు. రోజు మీ ఇంట్లో ఎలా వంటలు చేస్తారో.. ఎలా తింటారో అవే ఏర్పాట్లు ఉండాలి' అని జిల్లా అధికారులు సూచించడంతో రెండు గదులు ఉన్న ఆ ఇంట్లో మొదటి గదిలో సీఎం భోజనం చేసేందుకు చాప పరిచారు.

మునక్కాయ కూర.. గోంగూర చట్నీ

భోజనానికి సీఎం రేవంత్‌రెడ్డి కూర్చున్న వరుసలో బూరం శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో పాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీఎస్ శాంతికుమారి కూర్చోగా ఎదురు వరుసలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కూర్చున్నారు. మంత్రి తుమ్మల భోజనం వడ్డింపు ఏర్పాట్లను పర్యవేక్షించే పనిలో భాగంగా నిల్చునే ఉన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రోజువారీగా ఉపయోగించే స్టీలు పళ్లెంలో సన్నబియ్యంతో చేసిన అన్నం, పులిహోర, పాయసం, గోంగూర చట్నీ, మునక్కాయ, దోసకాయ, టమాటా కూరలను వడ్డించారు. వీటితో పాటు మజ్జిగ, పెరుగు, పానకం కూడా సిద్ధం చేశారు.



శ్రీనివాస్ తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయం

ఖమ్మం వంటలు బాగుంటాయి

వడ్డింపు మొదలు పెట్టగానే 'ఖమ్మం వంటలు బాగుంటాయి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటి ముద్ద తింటూనే.. 'ఇంతకు ముందు తుమ్మలనే ఈ వంటలు నాకు పరిచయం చేశారు' అని ఆయన గతాన్ని గుర్తు చేసుకున్నారు. భోజనం చేస్తూ మధ్యమధ్యలో ప్రభుత్వం అందిస్తున్న మహిళలకు ఉచిత బస్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంట్ పథకాలు ఎలా ఉన్నాయంటూ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సీఎం అడిగారు. పెరుగుతో భోజనం పూర్తి చేశారు. అంతకు ముందే రేవంత్‌రెడ్డికి వడ్డించే భోజనాన్ని ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బందితో పాటు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు (టెస్ట్ అండ్ టేస్ట్) పరిశీలించారు.

వీళ్లకు ఉద్యోగం చూడండి..

భోజనం పూర్తయిన తర్వాత శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి సాయం చేయాలంటూ సీఎంను పద్మావతి కోరారు. దీంతో వారికి అవసరమైన సాయం చేయాలంటూ కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. చివరగా శ్రీనివాస్ తల్లిదండ్రులు శంకర్‌రావు, పద్మావతికి రేవంత్‌రెడ్డి వస్త్రాలు అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:21 గంటల వరకు మొత్తంగా మూడు గంటల ఇరవై ఒక్క నిమిషాల పాటు సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన కొనసాగింది.

సీఎం పర్యటన సాగిందిలా..

శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భద్రాచలం వచ్చారు. ఉదయం 10 గంటలకు ఆయన వస్తారని షెడ్యూల్ విడుదల చేసినా గంట ఆలస్యంగా పర్యటన కొనసాగింది. మొత్తంగా 3–20 గంటల పాటు సీఎం ఇక్కడ ఉన్నారు.

- 11 గంటలు : సారపాక ఐటీసీలోని బీపీఎల్ స్కూల్‌లోని హెలీప్యాడ్‌కు చేరిక
- 11–04 : హెలీప్యాడ్ నుంచి ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు ప్రయాణం
- 11–20 : ఐటీసీ గెస్ట్‌హౌస్ నుంచి భద్రాచలానికి రోడ్డుమార్గాన ప్రయాణం
- 11–32 : రామాలయం వద్దకు చేరుకున్న సీఎం
- 11–55 : మిథిలా స్టేడియానికి చేరుకుని ప్రభుత్వం తరపున రామయ్యకు పట్టువస్త్రాల సమర్పణ
- 12–37 : సీఎం దంపతులకు ఆశీర్వచనం అందజేసిన అర్చకులు
- 12–42 : కల్యాణమండపం నుంచి రోడ్డు మార్గాన సారపాకకు ప్రయాణం
- 12–50 : ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరిక
- 1–20 : గెస్ట్ హౌస్ నుంచి సారపాకకు ప్రయాణం
- 1–25 : గెస్ట్‌హౌస్ నుంచి సన్నబియ్యం లబ్ధిదారుడు శ్రీనివాస్ ఇంటికి చేరిక, అక్కడే భోజనం
- 1–45 : సారపాక నుంచి ఐటీసీ గెస్ట్‌హౌస్, అక్కడి నుంచి హెలీప్యాడ్‌కు చేరిక
- 2–21 : సారపాక నుంచి హైదరాబాద్ బయలుదేరిన హెలీకాప్టర్

– భద్రాచలం అర్బన్

మిస్ట్ ఫాగింగ్‌తో ఉపశమనం

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులు.. స్టేడియంలో ఏర్పాటుచేసిన మిస్ట్ ఫాగర్లతో ఎండ నుంచి ఉపశమనం పొందారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది కల్యాణం జరిగే స్టేడియంలో అధికారులు వీటిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మిస్ట్ ఫాగర్ల ద్వారా భక్తులకు వడదెబ్బ నుంచి రక్షణ కల్పించారు. అయితే, కల్యాణ వేడుకను సమీపం నుంచి తిలకించేందుకు వీలుగా సెక్టార్లలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్లు పని చేయకపోవడంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

రామయ్యకు నేడు పట్టాభిషేకం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగిన మరుసటి రోజున పట్టాభిషేకం వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో సోమవారం రామచంద్రమూర్తిని పట్టాభిషిక్తుడిని చేయనున్నారు. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9–45కు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో హెలికాప్టర్ ప్రారంభం
- 10.45కు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు
- 11.20 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి రోడ్డు మార్గంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానానికి వస్తారు
- 11.45కు దేవస్థానం నుంచి మిథిలా స్టేడియానికి చేరుకుంటారు
- 12.45 వరకు స్టేడియంలో పట్టాభిషేక మహోత్సవాన్ని వీక్షిస్తారు
- 12,45కు స్టేడియం నుంచి బయలుదేరి 1 గంటకు ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు
- 1.25కు హెలీప్యాడ్‌కు.. ఆతర్వాత 1.30కు హెలీకాప్టర్‌లో పయనం



స్వామివారి పాదుకలు చూపిస్తున్న అర్చకుడు (ఫైల్)

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేకం ఉన్నందున ఐడీఓసీలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేసేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. శ్రీరామనవమికి వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో కిన్నెరసానిని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 428 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,355, 200 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నిరాశే మిగిలింది



ప్రారంభోత్సవానికి వచ్చే అతిథుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో నూతన హంగులతో ఆధునికీకరించిన ఆదివాసీ గిరిజన మ్యూజియాన్ని సీఎం రేవంత్ రెడ్డితో ప్రారంభోత్సవం చేయించాలని ఐటీడీఏ అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. సీఎంతోపాటు చివరికి మంత్రులు, ఉన్నతాధికారులు సైతం ప్రారంభోత్సవానికి రాకపోవడంతో ఐటీడీఏ పీఓ, ఇతర అధికారులు నిరాశకు గురయ్యారు. ప్రారంభోత్సవం మధ్యాహ్నం 12.10 నుంచి 2.10 గంటల మధ్యలో ఉంటుందని పీఓ పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. 12 గంటల సమయంలో మ్యూజియం ముందు రోడ్డుపై నిలబడి ప్రారంభోత్సవానికి వచ్చే వారికి స్వాగతం పలికేందుకు వేచి చూడడం ప్రారంభించారు. మధ్యాహ్నం మూడు గంటలవరకు ఎదురు చూసి నిరాశ చెందిన పీఓ అక్కడ నుంచి వెళ్లిపోయారు. సుమారు నాలుగు గంటలపాటు ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోయిన పీఓ.. ఆ తర్వాత నూతనంగా నిర్మించి తాటాకుల గుడిసెలో కాసేపు నిరీక్షించారు. పట్టణంలోని వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు, ఐటీడీఏ యూనిట్ అధికారులు అలాగే ఎండలో వేచి చూడాల్సి వచ్చింది. చివరికి ప్రారంభోత్సవం లేకుండానే పర్యటకులను మ్యూజియం సందర్శనకు అనుమతించారు.

ఏడుగురు బీట్ అధికారులకు పదోన్నతి

పాల్వంచరూరల్: భద్రాద్రి జోనల్ పరిధి అటవీ శాఖలో ఏడుగురు బీట్ అధికారులకు సెక్షన్ ఆఫీసర్లుగా పదోన్నతి లభించింది. ఇందులో భద్రాద్రి జిల్లా నుంచి ముగ్గురు, ఖమ్మం జిల్లా నుంచి నలుగురు ఉన్నారు. పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్ యానంబైల్ రేంజ్ కిన్నెరసాని బీట్ ఆఫీసర్ బట్టు రాములు, ఇల్లెందు డివిజన్ కాచనపల్లి రేంజ్ బీట్ ఆఫీసర్ బి.లక్ష్మణ్, ఇల్లెందు రేంజ్ బీట్ ఆఫీసర్ వి.ముత్తయ్య, తల్లాడ రేంజ్ బీట్ ఆఫీసర్ కే.వీ.బీ.వీ.ప్రసాదలింగం, గుగులోత్ ఉపేందర్, సత్తుపల్లి రేంజ్ బీట్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, కారేపల్లి రేంజ్ బీట్ ఆఫీసర్ వి.నాగరాజు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఇందుకు సంబంధించి భద్రాద్రి జోనల్ సీసీఎఫ్ భీమానాయక్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో ముగిసిన ఉత్సవాలు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా సాగుతున్న శ్రీదేవి వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున శ్రీరామనవమి కూడా కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు నాద నీరాజనం, సూక్తి పారాయణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, శ్రీలలితా సహస్ర నామ హవనం, పూర్ణాహుతి తదితర పూజలు చేశాక అమ్మవారికి హారతి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు..

బీఆర్ఎస్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. భద్రాచలం శ్రీరామనవమి వేడుకకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆయన పెద్దమ్మతల్లి సన్నిధికి రాగా.. అర్చకులు, ఈఓ ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



భక్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

ఈనెల 10 నుండి పాలిసెట్ ఉచిత శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సింగరేణి వ్యాప్తంగా సంస్థ పాఠశాలల్లో ఈనెల 10 నుంచి మే 10 వరకు ఉచితంగా పాలిసెట్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ రాయాల్సి ఉండగా, త్వరలోనే నోటిఫికేషన్ రానుందని చెప్పారు. ఈమేరకు విద్యార్థులు ఉచిత శిక్షణ ద్వారా సిద్ధం కావాలని, తద్వారా మంచి ర్యాంకులు సాధించి పాలిటెక్నిక్ పూర్తిచేస్తే భవిష్యత్‌లో మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. సింగరేణి పాఠశాలలే కాక ఇతర పాఠశాలల్లో ఎస్సెస్సీ పూర్తిచేసిన విద్యార్థులు వివరాల కోసం సింగరేణి పాఠశాలల హెచ్ఎంలను సంప్రదించాలని సూచించారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య

చుంచుపల్లి: జిల్లాలో అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీఎస్సార్ నిధుల ద్వారా కొనుగోలు చేసిన 70 ట్రై మోటర్ సైకిళ్లను ఆదివారం దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ అభివృద్ధి సంస్థ వినూత్న కార్యక్రమాల ద్వారా సమాజ సేవలో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ఇప్పటికే పాఠశాలల అభివృద్ధికి, గ్రామాల్లో మౌలిక వసతులు, దివ్యాంగులకు చేయూత నందించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమని అన్నారు. దివ్యాంగులు మోటార్ సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అడవులు అంతరించి పోకుండా ప్రతి ఒక్కరు మొక్కలు నాటేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత దివ్యాంగులపై ఉందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం వివిధ సంస్థలే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సైతం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలో పోడు కొట్టడం ద్వారా కొంత అటవీ విస్తీర్ణం తగ్గిందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకృతిని రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. అడవులు, చెట్ల నరికివేతతో మానవాళి మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ సైకిలాబ్, కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి డివిజన్ మేనేజర్లు చంద్రమోహన్, కవిత, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ట్రై మోటార్ సైకిల్ అందిస్తున్న పొదెం వీరయ్య, కలెక్టర్ పాటిల్ తదితరులు

పోటెత్తిన భక్తులు.. వెంటాడిన అసౌకర్యాలు

- తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- భద్రాచలంలో ఎప్పటిలాగే సామాన్య భక్తులకు తప్పనిపాట్లు
- కౌంటర్ల సమాచారం లేక తలంబ్రాల కోసం అవస్థలు
- మూడుసార్లు ట్రాఫిక్ నిలిపివేతతో ఎండలో అల్లాడిపోయారు..
- షామియానాలు లేక చెట్ల కిందనే సేదదీరాల్సిన పరిస్థితి
- కరకట్ట సమీపంలో తాగునీరు దొరకలేదని పలువురి ఆవేదన
- కల్యాణానికి గతంకంటే భక్తులు పెరగగా..ఆ స్థాయిలోలేని వసతులు


గోదావరి నదిలో పవిత్రస్నానం ఆచరిస్తున్న భక్తులు


భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో వాహనాల రద్దీ

శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాతోపాటు పలు రాష్ట్రాల నుంచి భద్రాచలం తరలివచ్చారు. చాలామంది శనివారమే చేరుకోగా, ఆదివారం ఉదయం పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మిథిలా స్టేడియానికి చేరుకుని కల్యాణం వీక్షించారు. గతేడాది కంటే ఈసారి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అయితే భక్తుల సంఖ్య తగినట్లు అధికారులు ఏర్పాట్లు చేయలేదు. తాగునీరు దొరకక ఇబ్బందులు పడ్డారు. షామియానాలు ఏర్పాటు చేయకపోవడంతో కరకట్ట పక్కన చెట్ల కిందనే సేదదీరారు. ఆలయ పరిసరాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు కల్యాణం వీక్షించలేకపోయారు. ఇక ఎప్పటిలాగే ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రతీసారి విమర్శలు ఎదుర్కొంటున్నా పోలీసు శాఖ తీరు ఈ సారి కూడా మారలేదు. బారికేడ్ల వద్ద సామాన్య భక్తులను నిలిపివేసి, తమశాఖ వారిని మాత్రం అనుమతించారని పలువురు ఆరోపించారు.

–భద్రాచలం అర్బన్/భద్రాచలంటౌన్/చర్ల

వీవీఐపీ, వీఐపీలు..

శ్రీరామనవమి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ తదితరులు హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరహరి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఇంటెలిజెన్స్ డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి, హైదరాబాద్ ఎండోమెంట్ ట్రిబ్యునల్ జడ్జి వెంకట్, హైదరాబాద్ సిటీ సివిల్ జడ్జి భవాని, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తులు రాజగోపాల్, వసంత్‌పాటిల్, కొత్తగూడెం న్యాయమూర్తి భానుమతి, భద్రాచలం న్యాయమూర్తి శివనాయక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు, మట్టారాగమయి, కార్పొరేషన్ చైర్మన్లు పొదెం వీరయ్య, మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సినీతారలు కొణిదల నిహారిక, వితిక షేరు వేడుకల్లో పాల్గొన్నారు.

బస్టాండ్‌లోకి రాని ఏపీ బస్సులు

వేడుకలకు ఏపీ నుంచి భక్తులకు అధిక సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా నడిపిన బస్సులను బస్టాండ్‌లోకి అధికారులు అనుమతించలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిలిపివేయగా, రామాలయం నుంచి కిలోమీటర్ మేర కాలినడకన వెళ్లాల్సి వచ్చింది. చాలామంది భక్తులకు విషయం తెలియక బస్టాండ్‌కు చేరుకుని ఆందోళన చెందారు. మండుటెండలో నడుస్తూ మైదానానికి చేరుకున్నారు.

25 మంది కుటుంబాలకు అప్పగింత

శ్రీసీతారామ చంద్రస్వామివారి కల్యాణం తిలకించేందుకు వచ్చి 25 మంది వృద్ధులు తప్పిపోయి మిథిలా స్టేడియం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ కేంద్రం వద్ద ఉండిపోయారు. దీంతో అధికారుల పలు మార్లు మైక్ ద్వారా ప్రచారం చేసి వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కనిపించని తలంబ్రాల కౌంటర్లు


తలంబ్రాల కోసం పోటీపడుతున్న భక్తులు

కల్యాణం అనంతరం తలంబ్రాల కోసం భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. వీవీఐపీలు వెళ్తుండటంతో పోలీసుల హడావుడి నడుమ ప్రధాన రహదారికి చేరుకున్న భక్తులు తలంబ్రాల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 80 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రకటించినా.. అన్నీ ఆలయ చుట్టుపక్కలే ఉన్నాయి. సరైన సూచికలు లేకపోవడంతో పలువురు గందరగోళానికి గురయ్యారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రెండు కౌంటర్లు ఉన్నా తోపులాట జరిగింది. ఇక భక్తులను నియంత్రించాలని పోలీసులు బందోబస్తు విధులు మాని తలంబ్రాల కోసం ఎగబడ్డారు. ఒకేట కాకుండా ప్రధాన కేంద్రాల్లో ఇంకా ఎక్కువ సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమైంది.

తీరు మారని పోలీస్


తమ శాఖ ఉద్యోగిని వదిలి భక్తులను నిలిపివేసిన పోలీసులు

వీఐపీల తాకిడి పెరగడంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రుల, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరుకాగా, ఎస్పీ రోహిత్ రాజు పర్యవేక్షణలో 1800 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరిలో కొందరు కేవలం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సేవలు చేయడమే సరిపోయింది. ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో సామాన్యులు ఇబ్బందులు పడ్డారు. ఎప్పటిలాగే పోలీసు వాహనాలను, పోలీసు సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా అనుమతించడంతో సామాన్య భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పలుచోట్ల వాదనలకు దిగారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరులో మాత్రం మార్పు రావడం లేదని పలువురు పేర్కొన్నారు.

చెట్ల కిందే సేద


షామియానాలు లేక చెట్ల కింద ఇలా..

రామయ్య కల్యాణానికి వచ్చిన భక్తులను అసౌకర్యాలు వెంటాడాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీరు, షామియానాలు వంటి సౌకర్యాలు సరిపడా ఏర్పాటు చేయలేదు. గతంలో కరకట్టకు వెళ్లే ప్రాంతంలో, రామాలయం ఎదురుగా పెద్ద ఎత్తున షామియానాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి ఏర్పాటు చేయకపోవడతో రెండు రోజులుగా కరకట్ట సమీపంలో ఉన్న చెట్ల కిందనే సేదదీరారు. ఇక రెండు రోజులపాటు ఇక్కడే ఉండి కల్యాణం, పట్టాభిషేకం తిలకించేందుకు పిల్లాపాపలతో ఊర్లకు ఊర్లుగా పలువురు కదిలిరాగా.. వారికి వంటా వార్పు చేసుకునేందుకు కనీసం నీళ్లు కూడా దొరకలేదు. రామాలయ పరిసర ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో మిథిలా స్టేడియంలోకి వెళ్లలేని భక్తులు కల్యాణం వీక్షించలేకపోయారు. రామయ్య కల్యాణ క్రతువును మైకుల్లోనే వినాల్సి వచ్చిందని పలువురు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలతో అవస్థ..

భద్రాచలంలో మూడుసార్లు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీఎం రేవంత్ కల్యాణంలో పాల్గొనేందుకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు 30, 25 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిపివేశారు. దీంతో ద్విచక్రవాహనదారులు మండుటెండల్లోనే ఉండాల్సి వచ్చింది. ఎండ వేడిమిని తట్టుకోలేక కొందరు అసహనం వ్యక్తం చేస్తూ బైక్‌ల హారన్ మోగించారు. ఆ తర్వాత బ్రిడ్జి సెంటర్ నుంచి సారపాక వెళ్తున్న వాహనాలను పంపించే క్రమంలో ప్రతి 15 నిమిషాలకు వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడింది. ట్రాఫిక్ సమస్యను పోలీసులు చక్కదిద్దలేకపోయారు. ఫలితంగా 3, 4 గంటలపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. కొందరు స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికుల వద్ద నుంచి ప్రతి వస్తువుపూ అధిక ధరలు వసూలు చేసి జేబులు నింపుకున్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

25 ఏళ్లుగా సైకిల్ పైనే..

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఓ భక్తుడు 25 ఏళ్లుగా సైకిల్‌పై వస్తున్నాడు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పెద్దపల్లవపాలేనికి చెందిన కొల్లాటి రాధాకృష్ణ స్వామికి రాముడంటే ఎనలేని భక్తి. ఏటా కల్యాణానికి సైకిల్‌పై వస్తూ, స్వామివారిని దర్శించుకుని తిరుగు పయనమవుతున్నాడు. ఆదివారం కూడా సైకిల్‌పైనే వచ్చాడు. కాగా, గత నెలలో ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు సైకిల్‌పైనే వెళ్లి వచ్చినట్లు రాధాకృష్ణ స్వామి తెలిపాడు.


సైకిల్‌పై భద్రాచలం వస్తున్న రాధాకృష్ణ

అడ్డుగా గొడుగులు..

భద్రాచలం: శ్రీ సీతారాముల కల్యాణం కనులారా వీక్షించేందుకు టికెట్లు కొని స్టేడియానికి భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. టికెట్ల కోతతో పాటు వీవీఐపీ, వీఐపీల తాకిడి పెరగటంతో కొందరు నిలబడే వీక్షించాల్సి వచ్చింది. దీనికితోడు స్టేడియానికి ఎదురుగా ఉన్న సెక్టార్లలో లైవ్ టెలికాస్టింగ్ సిబ్బంది ఏర్పాటు చేసుకున్న గొడుగులతో వెనుక వైపు ఉన్న భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రూ. వేలు ఖర్చు పెట్టి టికెట్లు కొనుగోలు చేసినా స్వామివారి కల్యాణం ప్రశాంతంగా చూడలేకపోయామని విచారం వ్యక్తం చేశారు. అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదన్నారు.

తాగునీరు దొరకలేదు



30 ఏళ్లుగా కల్యాణానికి వస్తున్నాం. ప్రతీసారి మా గ్రామం నుంచి సుమారు 50 కుటుంబాల వారం ఏలూరు నుంచి భద్రాచలానికి మూడు రోజులపాటు కాలినడకన చేరుకుని ఇక్కడ కల్యాణం, పట్టాభిషేకం చూసి తిరిగి వెళ్తాం. ఈ సారి కూడా వచ్చాం. కానీ వంటా వార్పు చేసుకునేందుకు కరకట్ట ప్రాంతంలో తాగునీరు దొరకలేదు. – పెద్దింటి రమ, కైకలూరు

చెట్ల కిందే సేదదీరాం..



రెండు రోజులపాటు ఇక్కడే ఉండి రామయ్య కల్యాణం, పట్టాభిషేకం చూడాలని 20 కుటుంబాల వారం ట్రాలీ తీసుకుని వచ్చాం. తలదాచుకునేందుకు రామాలయ ప్రాంతంలో షామియానాలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో కరకట్ట కింద రోడ్డుకు ఇరువైపులా చెట్ల కిందనే సేదదీరాం.

– రాము, ఆకివీడు

ఎల్‌ఈడీ స్క్రీన్లు లేవు..



కల్యాణాన్ని తిలకించేందుకు మిథిలా స్టేడియంలో మాత్రమే ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. రాజమండ్రి నుంచి వచ్చిన మాకు మిథిలా స్టేడియంలోకి వెళ్లే అవకాశం దొరకలేదు. స్టేడియం బయట కూడా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తే బాగుండేది. కల్యాణాన్ని తంతును మైకులో మాత్రమే వినాల్సి వచ్చింది. ప్రత్యక్షంగా చూడలేక పోయాం. – ఈశ్వర్‌రావు, రాజమండ్రి

దర్శనం కష్టంగా మారింది...



వ్యయ ప్రయాసలకోర్చి రామయ్య కల్యాణానికి వస్తే.. స్వామివారిని దర్శించుకోవడం కష్టతరంగా మారింది. క్యూలైన్లు లేకపోవడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. మహిళలు, పిల్లలు, వృద్ధులను వెనుకకు నెట్టివేశారు. క్యూ లైన్‌లు ఏర్పాటు చేస్తే రామయ్య దర్శనంగా సులువుగా జరిగేది. – దుర్గా, పోతులూరు

ఇరవై ఏళ్లుగా వస్తున్నా...



రామయ కల్యాణం కనులారా వీక్షించేందుకు 20 ఏళ్లుగా భద్రాచలం వస్తున్నాను. ఎండలు మస్తుగా ఉన్నాయి. టీవీలో వస్తాది కల్యాణం చూడు నాన్న అని నా బిడ్డలు చెప్పినా.. వినకుండా నా భార్య, నేను వచ్చాం. టీవీలో కంటే రామయ్య కల్యాణం దగ్గరుండి చూస్తేనే మనస్సు నెమ్మదిస్తుంది.

– కేశవరావు, నల్లగొండ

ఏర్పాట్లు బాగున్నాయి..



రామయ్య కల్యాణం చూసేందుకు వచ్చే భక్తుల కోసం అధికారులు చేసిన ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ఐదేళ్లుగా భద్రాచలం రామయ్య కల్యాణం చూసేందుకు వస్తున్నాను. ఆలయ అధికారులు గతంలో కంటే మెరుగైన ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు ఇంకా ఎక్కువ వేస్తే బాగుండేది.

– నాగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం, ఏపీ

తలంబ్రాల కోసం ఇబ్బంది..



కల్యాణం అనంతరం ఒక్కసారిగా జనం స్టేడియం నుంచి బయటకు రావడంతో తలంబ్రాల ఎక్కడ దొరుకుతాయే తెలియక ఇబ్బంది పడ్డాం. మొదటిసారి రామయ్య కల్యాణం చూసేందుకు భద్రాచలం వచ్చాం. తలంబ్రాల కోసం ప్రచారం తక్కువగా చేస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

– వెంకటరమణ, మంగళగిరి, ఏపీ


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పాయం, జారే, తెల్లం, కోరం


వేడుకల్లో హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా


ఆర్టీసీ బస్టాండ్‌లో భక్తుల సందడి


గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు


ప్రసాదాల కౌంటర్ వద్ద భక్తజనం

మత సామరస్యానికి ప్రతీక


పులిహోర పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెంఅర్బన్: మన దేశం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని 22వ వార్డు మాజీ కౌన్సిలర్ జయంతి మసూద్ దంపతులు చేసిన పానకం, ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సోదరభావంతో ఐకమత్యంగా అందరి పండుగలను జరుపుకుందామని పేర్కొన్నారు.




హాజరైన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు శైలజా రామయ్యర్, శ్రీధర్, ప్రముఖుడు కె.బాపిరాజు, వైకుంఠ ద్వారం వద్ద పోలీసులు


సినీనటి కొణిదెల నిహారిక


ఐపీఎస్ అధికారి సౌమ్యా మిశ్రా



మంత్రి తుమ్మల, కార్పొరేషన్ చైర్మన్ రాయల, ఎమ్మెల్యే రాందాస్

సార్ పీటలు తెచ్చుకోవచ్చా..?


కలెక్టర్‌తో సంభాషిస్తున్న భక్తులు

భక్తులు నేలపై కూర్చొనే సీతారాముల కల్యాణం వీక్షిస్తారు. అయితే తాము కింద కూర్చోలేమని, పీటలు తెచ్చుకోవచ్చా అని వీఐపీ గ్యాలరీ వద్ద ఉన్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను ఇద్దరు వృద్ధులు అడిగారు. కలెక్టర్ సరేననడంతో వెంటనే వారు వెళ్లి పీటలు తెచ్చుకుని కూర్చొని రాముడి కల్యాణం తిలకించారు.

చింతల చెరువులో పడి వృద్ధురాలి మృతి

పాల్వంచ: చింతల చెరువులో కాలు జారి పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడెనికి చెందిన కోమటి నాగరత్నమ్మ (78) కొద్ది రోజులుగా నరాల నొప్పితో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 5న ఉదయం 9 గంటల సమయంలో పాత పాల్వంచలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం చింతలచెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించారు. వైద్యుడి వద్దకు వెళ్లి చెరువు కట్ట మీద నుంచి వస్తున్న క్రమంలో కాలు జారి పడి మృతి చెంది ఉండవచ్చని కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలకు వల వస్తే.. బైక్ చిక్కింది

అశ్వారావుపేటరూరల్: చెరువులో చేపల వేటకు వెళ్లిన గిరిజనులకు బైక్ దొరికింది. ఆదివారం మండల పరిధిలోని తిరుమల కుంట గ్రామ శివారులో ఊర చెరువులో స్థానిక గిరిజనులు చేపల వేటకు వెళ్లారు. వలలు వేయగా ద్విచక్రవాహనం చిక్కింది. అందరూ కలిసి నీళ్లలో ఉన్న బైక్‌ను బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. నంబరు ఆధారంగా విచారించిన పోలీసులు బైక్ బూర్గంపాడుకు చెందిన రవీందర్ అనే వ్యక్తిదిగా గుర్తించారు. బాధితుడికి సమాచారం ఇవ్వగా, తన బైక్ సుమారు 8 నెలల క్రితం చోరీకి గురైనట్లు చెప్పినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. బైక్ చోరీ, చెరువు నీళ్లలో పడేయటం వెనుక కారణాలేమిటో విచారిస్తామని పేర్కొన్నారు.


చెరువు నీళ్లలో దొరికిన ద్విచక్రవాహనం

దుక్కిటెడ్లు అపహరించిన మాజీ సర్పంచ్ !

కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేసిన మండల కమిటీ

గుండాల: మేతకు వెళ్లిన దుక్కిటెడ్లను చోరీ చేస్తూ మాజీ సర్పంచ్ పట్టుబడగా... గ్రామస్తులు దేహశుద్ధి చేసిన ఘటన ఇది. ఆళ్లపల్లి మండలంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అనంతోగు వాసులైన పూకె రాంబాబు, మొల్కం జోగయ్య చెందిన దుక్కిటెడ్లు మేతకు వెళ్లాయి. తిరిగి అవి ఇంటికి చేరకపోగా... బాటన్ననగర్ సమీపాన చెట్లకు కట్టేసి ఉన్నాయని స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో ఎవరోచోరీ చేసేందుకే చెట్లకు కట్టేసి ఉంటారని గుర్తించి కొంత దూరంలో మాటు వేశారు. ఇంతలోనే రాత్రివేళ ఇద్దరు వ్యక్తులు ఆ పశువులను తీసుకెళ్తుండగా స్థానికులు అడ్డగించడంతో ఓ వ్యక్తి పరారయ్యాడు. మరో వ్యక్తిని అనంతోగు తీసుకొచ్చి దేహశుద్ధి చేయడంతో తాను గుండాల మండలం మోదుగులగూడెంకు చెందిన పూనెం సమ్మయ్య(ముత్తాపురం మాజీ సర్పంచ్)ను అని చెప్పాడు. అంతలోనే పారిపోయిన వ్యక్తి కాచనపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు చేరుకున్న పోలీసులు ఆయనను వదిలేయాలని చెప్పగా ససేమిరా అనడంతో మోదుగులగూడెం వాసులు ఆదివారం ఉదయం వచ్చి సమ్మయ్యను తీసుకెళ్లారు.

కాంగ్రెస్ నుంచి బహిష్కరణ..

పశువులను అపహరించి పట్టుబడిన మాజీ సర్పంచ్ పూనెం సమ్మయ్యను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ఎస్.కే.ఖదీర్, చాట్ల పద్మ తెలిపారు. ఆళ్లపల్లిలో ఆదివారం వారు మాట్లాడుతూ పశువుల దొంగతనాన్ని అడ్డు పెట్టుకుని, పినపాక ఎమ్మెల్యేపై బురద చల్లడం సరికాదని పేర్కొన్నారు.